# ఈసీ మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

- ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి
- సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి


ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, అక్టోబర్ 10 : అసెంబ్లీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఈసీ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై సెక్టార్, ఎంసీసీ, ఎంపీడీవోలు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్, అకౌంటింగ్ టీమ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనేందుకు సమాన అవకాశాలు కల్పించేందుకు భారత ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టిందని, దీనిని అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత సమయంలోపు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పక్షాల సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతినిచ్చే సమయంలో పక్షపాతం లేకుండా వ్యవహరించాలన్నారు. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికి ప్రాధాన్యతనిస్తూ అనుమతులు మంజూరు చేయాలని, ఎన్నికల సమయంలో అధికారు ప్రవర్తన చాలా కీలకమని, వ్యక్తిగత అభిప్రాయాలతో కాకుండా నిబంధనల మేరకు కట్టుదిట్టంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్ర్యమంలో డీసీవో సర్దార్ సింగ్, డీసీఎస్వో అరవింద్ రెడ్డి, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంపీడీవోలు ఇక్బాల్, ప్రవీణ్, శ్రీనివాస్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సంధ్యారాణి, డీటీలు విజయ్ కుమార్, అనిస్ ఫాతిమా, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 10 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఎదిర వైద్యశాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన పూనెం రమణమ్మ కుటుంబ సభ్యులకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎదిర వైద్యాధికారిణి భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విష జ్వరంతో నలుగురు మృతి


మనోహర్ (ఫైల్)

వాజేడు, అక్టోబర్ 10 : విష జ్వరంతో చికిత్స పొందుతూ నలుగురు మృతి చెందారు. మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన మాద జగదాంబ (50) పది రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స పొంది తగ్గకపోడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ వైద్యశాలలో చేరింది. జ్వరం తగ్గుముఖం పట్టిన అనంతరం ఇంటికి వచ్చింది. మరలా జ్వరం రావడంతో ఆరోగ్యం విషమించి మంగళవారం మృతి చెందింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన మాద మనోహర్ (20) డెంగీ జ్వరంతో ఏటూరునాగారం వైద్యశాలలో చేరాడు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేయగా, పేరూరులోని తన బంధువుల ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.

**ఏటూరునాగారంలో**


స్వాతి (ఫైల్)

ఏటూరునాగారం : విష జ్వరంతో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన ఏటూరునాగారంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఇర్సవడ్ల నాగేశ్వర్‌రావు–భాగ్యలక్ష్మిల కుమార్తె స్వాతి (24)ని వాజేడు మండలానికి చెందిన కార్తీక్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్ది రోజులుగా తల్లి వద్ద ఉంటున్న స్వాతి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ప్రాథమిక చికిత్స పొందింది. సోమవారం సాయంత్రం ప్రైవేటు వైద్యశాలలో పరీక్షలు చేయించుకోగా బీపీ తక్కువగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి నాలుగేళ్ల పాప ఉంది. కాగా, స్వాతికి అందించిన చికిత్సపై ప్రభుత్వ వైద్యులు విచారణ చేసినట్లు తెలుస్తోంది.

**వెంకటాపూర్‌లో..**


అశోక్ (ఫైల్)

వెంకటాపూర్ : మండలంలోని పాలంపేటకు చెందిన బోడ అశోక్ (40) డెంగీతో మృతిచెందాడు. ఐదు రోజుల క్రితం డెంగీతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడున్నారు.

# మానసిక ఒత్తిడితో అనారోగ్య సమస్యలు

- సీనియర్ సివిల్ జడ్జి మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మాధవి

వెంకటాపూర్, అక్టోబర్ 10 : మానసిక ఒత్తిడి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలను న్యాయ సేవాధికార సంస్థ, డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయగా జడ్జి పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సైతం మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య మాట్లాడుతూ మానసిక వ్యాధి అంటే జీవన విధానంలో మార్పు రావడం, ఈ రోజు చేసిన పని రేపు గుర్తుండకపోవడం అని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ మేకల మహేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ బానోతు స్వామిదాస్, న్యాయవాదులు బాలుగు చంద్రయ్య, కొండి రవీందర్, సీహెచ్ రాజేందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, ఆయుష్ అధికారి సదానందం, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ వేసుకునే వారిని గుర్తించాలి


ఏటూరునాగారం : సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం/మంగపేట, అక్టోబర్ 10 : గ్రా మాల్లో టీకాలు వేసుకునే వారిని గుర్తించడంలో నిర్ల క్ష్యం చేయొద్దని మిషన్ ఇంద్ర ధనుష్ మానిటరింగ్ అధికారులు అరుణ్, ప్రశాంత్ అన్నారు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని ఏటూరునాగారం, అల్లంవారిఘనపూర్, ఆకులవారిఘనపూర్, రొయ్యూరు ఉప కేంద్రాలు, తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించి ఇంద్ర ధనుష్ అమలును డబ్ల్యుహెచ్‌వో ప్రాజెక్టు ఆఫీసర్లు, నేషనల్ మానిటరింగ్ టీం అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న లబ్ధిదారుల వివరాలను వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, రణధీర్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వ్యాక్సిన్ ఇవ్వడంతోపాటు రిజిస్టర్, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటింటా సర్వేచేసి చిన్నారులకు వేసిన టీకాల వివరాలను పరిశీలించారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న కోల్డ్ చైన్ తీరును ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డేవిడ్, సుమలత, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్ వైజర్ సంపత్, డీడీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


మరియ


హేమలత


మానస


రూపకళ


నీలిమ


అఖిల

# జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

మంగపేట, అక్టోబర్ 10 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మంగపేట ఎక్కటి సరోజినీ శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు ఆరుగురు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు బండారి మరియ, గుర్రాల హేమలత, దంతెనపల్లి మానస, కుంచం రూపకళ, గుమ్మడాల నీలిమ, గుడ్డేటి అఖిలకు డిగ్రీ స్థాయిలో మూడేండ్లు, పీజీ స్థాయిలో రెండేండ్లు ప్రతీ సంవత్సరం 10 వేల చొప్పున ఉపకార వేతనాలు వస్తాయని ఆయన వివరించారు. కాగా విద్యార్థినులను అధ్యాపకులు ఎం సంతోష్‌కుమార్, రేణుకాదేవి, జ్యోతిర్మయి, లక్ష్మణ్, అనిల్ కుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాస్, చిరంజీవి, రాజు, వైష్ణవి, వందన అభినందించారు.


తాడ్వాయి : గోడలపై రాతలను తొలగిస్తున్న తహసీల్దార్

# వాల్ రైటింగ్‌లను తొలగించాలి

- ఎన్నికల కోడ్ అమలు చేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

ఏటూరునాగారం, అక్టోబర్ 10 : గోడలపై రాజకీయ ప్రకటనలు తొలగించాలని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, జెండాలు తదితరాలను వెంటనే తొలగించాలని ఎంపీడీవో కుమార్‌ను ఆదేశించారు. ఐటీడీఏలోని పలు విభాగాలకు చెందిన గదులను పరిశీలించారు. గదులు, వెబ్‌సైట్లల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, లోగోలు, ఉంటే వెంటనే తొలగించాలని ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్‌ను ఆదేశించారు.

**పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగింపు**

తాడ్వాయి : గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, గోడ రాతలు కనపడకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ తోట రవీందర్ ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు కార్యదర్శి రేగ రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది మండల కేంద్రంలోని పలు కాలనీలు, ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలిగించే పనులను తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు.

**మంగపేటలో..**

మంగపేట : అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలు మొదలైంది. ఇందులో భాగంగా మంగళవారం అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు, ఫ్లెక్సీలతో పాటు గోడలు, ప్రధాన రహదారి వెంట ఉన్న బ్రిడ్జిల రెయిలింగ్‌లపై ఉన్న రాతలను పంచాయతీ సిబ్బంది తొలగించారు.


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

గోవిందరావుపేట, అక్టోబర్10 : మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి సభా ముఖంగా తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. అనంతరం ఎంఈవో గొంది దివాకర్, ఎంపీవో సాజిదా బేగం తమ నివేదికలను చదివి వినిపించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎలాంటి తీర్మానాలు చేయకుండా సభను యథాతథంగా ముగించారు. సమావేశంలో తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లిలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

వాజేడు, అక్టోబర్ 10 : మండలంలోని బొమ్మనపల్లిలో వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే తమకు సమచారం అందించాలని, వారికి ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు విద్యార్థి ఎంపిక


రాంచరణ్‌ను అభినందిస్తున్న కోచ్ అబ్బు

ఏటూరునాగారం, అక్టోబర్ 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న గొట్టె రాంచరణ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎండీ అబ్బు తెలిపారు. వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–19 కరాటే పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కాగా రాంచరణ్ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత అభినందించారు.